క్లుప్తంగా

బోరు బావి బాగు చేశారు



బోరుబావి మరమ్మతులు చేస్తున్న వాటర్ వర్క్స్ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు పద్మనాభనగర్‌లో పాడైన బోరు బావి ఎట్టకేలకు వినియోగంలోకి వచ్చింది. బోరు బావి బాగు చేయరూ అనే శీర్షికతో శనివారం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. ఇక్కడి బోరువావి మరమ్మతులు పూర్తి చేశారు.'సాక్షి' చొరవతో తమకు మంచి నీటిక ష్టాలు తీరాయని స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

కాలుష్య సమస్యపై వినతి



కాలుష్య సమస్యపై వినతి ఇస్తున్న సాంబశివరావు

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలోని హెచ్‌పీసీఎల్, కోరమాండల్ ఫెర్టిలైజర్స్ వంటి సంస్థల నుంచి వెలువడుతున్న కాలుష్యంతో పారిశ్రామిక వాసులు అనారోగ్యానికి గురవుతున్నారని ఇంటక్ నాయకుడు తెప్పల సాంబశివరావు అన్నారు. సమస్యను హెచ్‌పీసీఎల్,కోరమాండల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ ఇంటక్ జిల్లా నాయకుడు మంత్రి రాజశేఖర్‌కు సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఆ సంస్థలు పారిశ్రామిక ప్రాంతంలో ప్రతి నెలా ఉచిత మెడికల్ క్యాంప్‌లు నిర్వహించాల్సి ఉన్నా అలా చేయడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో ఇంటక్ నాయకులు సీదుకొండ రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

5 నుంచి శ్రావణమాస పూజలు



కనకమహాలక్ష్మి అమ్మవారు

డాబాగార్డెన్స్ : ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మి దేవస్థానంలో వచ్చే నెల 5 నుంచి సెప్టెంబర్ 3 వరకు శ్రావణమాసాన్ని పురస్కరించుకుని శ్రావణలక్ష్మి ప్రత్యేక కుంకుమ పూజలు జరువనున్నారు. నెల రోజులూ ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, అలాగే గురు, శుక్రవారాల్లో 2 విడతలుగా ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, 9.30 నుంచి 10.30 గంటల వరకు ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులకు దేవస్థానమే పూజా సామగ్రి సమకూర్చనుంది. విశిష్ట సామూహిక కుంకుమ పూజలో పాల్గొనదలిచే భక్తులు (దంపతులు) రూ.400 రుసుం చెల్లించాలి. పూజ అనంతరం భక్తులకు కండువా, జాకెట్టు ముక్క, పావుకేజీ పులిహోర, పావుకేజీ చక్కెర పొంగలి, శ్రీచక్రయంత్రం (రాగి) అందజేస్తారు. శ్రావణమాసంలో వచ్చే రెండో శుక్రవారం (ఆగస్టు 16) రోజున వరలక్ష్మీవ్రతం, 19న శ్రావణ పౌర్ణమి రోజున ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. శ్రావణమాసంలో నాలుగు శుక్రవారాలు (ఆగస్టు 9, 16, 23, 30) ప్రత్యేక పూజలు జరవనున్నారు.

కన్యకాపరమేశ్వరి ఆలయంలో..

కురుపాం మార్కెట్ సమీపాన గల కన్యకాపరమేశ్వరి ఆలయంలో శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని వచ్చే నెల 5 నుంచి సెప్టెంబర్ 3 వరకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. శ్రావణమాసంలో వచ్చే నాలుగు శుక్రవారాల్లో అమ్మవారి మూల విరాట్‌కు ప్రాత:కాలంలో ప్రత్యేక క్షీరాభిషేకం, సామూహిక శ్రీచక్రసహిత కుంకుమ పూజలు నిర్వహించనున్నారు.

ఆదర్శ గురువు



కూచిపూడి నృత్యం చేస్తున్న లోవరాజేశ్వరి



కోలాటంలో లోవరాజేశ్వరి వద్ద శిక్షణ పొందిన చిన్నారులు(ఫైల్)

- మహిళలు,చిన్నారులకు కోలాటంలో ఉచిత శిక్షణ

మల్కాపురం: తనకు తెలిసిన విద్యను పది మందికి ఉచితంగా నేర్పాలనుకుంది ఆమె. ఆలోచన వచ్చిందే తడువుగా పలు ప్రాంతాల్లో శిబిరాలు ఏర్పాటు చేసి చిన్నారులు,మహిళలకు కోలాటంలో ఉచితంగా శిక్షణ ఇస్తోంది. మరో వైపు కూచిపూడి నృత్యంలో కూడా ప్రతిభ చూపి ప్రముఖుల ప్రశంసలు అందుకున్న ఆకుల లోవరాజేశ్వరి విజయగాథపై కథనం.

లోవరాజేశ్వరి నేపథ్యం ఇదీ

జీవీఎంసీ 58వ వార్డు శ్రీహరిపురం సమీపంలోని గుల్లలపాలెం ప్రాంతానికి చెందిన ఆకుల లోవరాజేశ్వరి భర్త ఆకుల రామకృష్ణ,కుమారుడితో కలిసి ఉంటుంది.లోవరాజేశ్వరి తండ్రి అంగ వెంకన్న కోలాటం చేసే వాడు. తండ్రి చేస్తున్న కోలాట ప్రదర్శనను ఆరో ఏట నుంచే లోవరాజేశ్వరి ఏకాగ్రతతో అనుసరించేది. ఇంట్లో సాధన చేసేది.అలా అద్భుతమైన కళాకారిణిగా గుర్తింపు పొందింది. అంతటితో ఆగకుండా ఉచిత శిక్షణ శిబిరాల ద్వారా మరింత మంది కళాకారులను తీర్చిదిద్దుతోంది. అలా సుమారు 400 మంది మహిళలకు శిక్షణ ఇచ్చింది.బీఏ, ఎల్ఎల్‌బీ చదివిన లోవరాజేశ్వరికి కూచిపూడిలో కూడా మంచి ప్రావీణ్యం ఉంది. స్కూల్ స్థాయి నుంచి కూచిపూడిలో కృష్ణమాచార్యులు వద్ద శిక్షణ పొంది నగరంలోనే కాక పలు ప్రాంతాల్లో ప్రదర్శనలిచ్చింది. ఎంపీవిజయసాయి రెడ్డి,మళ్ల విజయప్రసాద్,ఆనంద్‌కుమార్ వంటి పెద్ద నుంచి ప్రశంసలు అందుకుంది.

ప్రదర్శనలు.. శిక్షణ శిబిరాలు శ్రీహరిపురం,గుల్లలపాలెం,రామ్‌నగర్,ఎదురవానిపాలెం,ములగాడ,నక్కవానిపాలెం,రాజ్‌కమల్‌కాలనీ వంటి ప్రాంతాల్లోని పలువురు మహిళలకు రాజేశ్వరి కోలాటంలో ఉచిత శిక్షణ ఇస్తుంది. అలాగే నేర్చుకున్న వారు సింహాచలం నృసింహస్వామి ఆలయం వద్ద,భీమిలి,స్వర్ణభారతి,విజయనగరం వంటి ప్రాంతాల్లో ప్రదర్శనలు ఇచ్చారు.

కళ పంచడమే లక్ష్యం



శ్రీరాజరాజేశ్వరి కోలాట, నాట్య కళా సంఘం ద్వారా కోలాటం,కూచిపూడిలో ఉచితంగా శిక్షణ ఇస్తున్నాను. తాను లేకున్నా తన ఆశయం కొనసాగుతూనే ఉండాలనే లక్ష్యంతో మరింత మందికి ఉచితంగా శిక్షణ ఇస్తాను. నేటి మహిళలు,చిన్నారులు టీవీలు,సెల్‌ఫోన్లకు పరిమితం అవుతున్నారు. అలాంటి వారు శిక్షణపై సాధన చేస్తే ఆరోగ్యంతో పాటు భక్తిభావం పెరుగుతుంది. తద్వారా పలువురికి సేవ చేయాలనే ఆలోచన వారిలో కలుగుతుంది.

– ఆకుల లోవరాజేశ్వరి, కోలాటం, కూచిపూడి నృత్య గురువు

కేవీ-1లో శిక్షా సప్తాహ్

కంచరపాలెం: కంచరపాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్ దరి విజయనగర్‌కాలనీలోని కేంద్రీయ విద్యాలయం -1లో 'శిక్షా సప్తాహ్' లో భాగంగా శనివారం 'న్యూట్రీషన్ డే' తల్లి విద్యార్థి పేరున 'ఏక్ ప్యాడ్ మాకే నామ్' కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా పాఠశాల ఆవరణలో ప్రిన్సిపాల్ కిషోర్ నేతృత్వంలో తల్లి విద్యార్థి చేత మొక్కలు నాటించారు. కిషోర్ మాట్లాడుతూ మాతృమూర్తికి గౌరవం ఇస్తూ ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు మదీనా మాలిక్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న విద్యార్థులు తల్లులు, హెచ్ఎంలు.

విద్యార్థులకు కిట్ల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు,యూనిఫాం అందిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఎమ్మెల్యే పి.గణబాబు శనివారం పుస్తకాలు,యూనిఫాంలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఉన్నత విద్యా వంతులుగా స్థిరపడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వెంకటరమణి, టీడీపీ,జనసేన,బీజేపీ నాయకులు మజ్జి సోమేష్,వంచదార్ల అప్పలరాజుయాదవ్,చంద్రమౌళి,కాకి పాలిరెడ్డి,జైశంకర్ పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం పాఠశాల ఆవరణలో ఎమ్మెల్యే గణబాబు విద్యార్థులతో కలిసి ఔషధ మొక్కలు నాటారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి



ఉపాధ్యాయులతో డీఈవో చంద్రకళ

డీఈవో చంద్రకళ

పెందుర్తి: ఉపాధ్యాయులు కచ్చితంగా సమయపాలన పాటించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ సూచించారు. తరగతి గదిలో అభ్యసన నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు 'టీచ్ టూల్' పేరిట జిల్లా స్థాయిలో ఎంపిక చేసిన 120 మంది హెచ్ఎంలు, ఉపాధ్యాయులకు తొమ్మిది రోజుల పాటు నిర్వహించిన శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. పెందుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో డీఈవో మాట్లాడుతూ కేటాయించిన బాధ్యతలను సకాలంలో పూర్తి చేసి ఉన్నతాధికారులకు సమర్పించాలని చెప్పారు. బాల్యాన్ని గౌరవించాలని..పిల్లలకు అర్థమయ్యే రీతిలో బోధన సాగించాలని ఆదేశించారు. సమగ్ర శిక్ష అభియాన్ అదనపు ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ ఎస్.పూర్ణచంద్ర, జిల్లా సహాయ ఎ.ఎం.వో జి.లక్ష్మి, హెచ్ఎం చిన్మయి, పెందుర్తి ఎంఈవో-2 మధుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ జీఎం సంజీవరావుకు సత్కారం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ హెచ్ఆర్ (ఐఆర్) జనరల్ మేనేజర్ కంచర్ల సంజీవరావును స్టీల్ వైఎస్సార్‌టీయూసీ నాయకులు ఘనంగా సత్కరించారు. సంజీవరావు ఈ నెలాఖరున పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ సంజీవరావు కార్మిక పక్షపాతిగా అనేక ఒప్పందాల్లో కీలక పాత్ర పోషించారన్నారు. కార్యక్రమంలో మార్టుపూడి పరదేశి, పిట్టారెడ్డి, ఎన్నేటి రమణ, ఎస్.ఈశ్వరరావు, నల్ల శ్రీనివాస్, జి.నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ఆర్ఎంహెచ్‌పీలో కొత్త చూట్ ప్రారంభం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ రా మెటీరియల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ (ఆర్ఎంహెచ్‌పీ) విభాగంలో నూతనంగా ఏర్పాటు చేసిన చూట్‌ను సీజీఎం మెయింటెనెన్స్ ఇన్‌చార్జి యు.శ్రీధర్ ప్రారంభించారు. పాత చూట్ స్థానంలో రూ.15 లక్షల వ్యయంతో దీనిని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ విభాగం అధికారులతో మాట్లాడుతూ విభాగం ఉత్పత్తి, మెయింటెనెన్స్ పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. కొత్త చూట్‌ను జాగ్రత్తగా వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో జీఎంలు పి.ఎస్.ఘోష్, ఎన్.వీరేశం, ఉన్నతాధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



నూతన చూట్‌ను ప్రారంభిస్తున్న స్టీల్‌ప్లాంట్ సీజీఎం శ్రీధర్

వరుస దొంగతనాలకు పాల్పడిన వ్యక్తి అరెస్ట్

- 36 గ్రాముల బంగారం స్వాధీనం
- క్రైం డీసీపీ వెంకటరత్నం వెల్లడి



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ వెంకటరత్నం

ఎంవీపీకాలనీ: కొంతకాలంగా వరుస దొంగతనాలకు పాల్పడుతున్న పాత నేరస్తుడ్ని ఎంవీపీ క్రైం పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. ఈ ఘటన వివరాలను నగర క్రైం డీసీపీ వెంకటరత్నం, ఏసీపీ ఎ.వెంకటరావు, ఎంవీపీ క్రైం సీఐ సీహెచ్ శ్రీనివాసరావులు శనివారం రాత్రి ఎంవీపీ పోలీసు స్టేషన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో వెల్లడించారు. పెద జాలరిపేట, గాంధీ సెంటర్ సమీపంలోని గెంబలి శారద ఇంట్లో ఈ నెల 22 రాత్రి దొంగతనం జరిగింది. పెద్ద ఎత్తున బంగారం, వెండి ఆభరణాలు, ఇతర వస్తువులు చోరీకి గురయ్యాయి. ఈ నేపథ్యంలో ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు క్రైం డీసీపీ వెంకటరత్నం, ఏసీపీ ఎ.వెంకటరావు ఆదేశాలతో ఎంవీపీ కాలనీ క్రైం పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సీఐ శ్రీనివాసరావుతో పాటు ఎస్ఐ జగదీష్ ఇతర సిబ్బంది ప్రత్యేక టీమ్‌గా ఏర్పడి సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి నిందితుడి కోసం గాలించారు. ఆదే ప్రాంతానికి చెందిన గుర్రపు శివ దొంగతనానికి పాల్పడినట్టు గుర్తించారు. దీంతో ఆతనిపై నిఘా పెట్టి శనివారం చాకచక్యంగా పేదవాల్తేర్ ఆర్టీసీ డిపో సమీపంలో అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నేరం అంగీకరించాడు. 36.76 గ్రాముల బంగారం, 2,604 గ్రాముల వెండితో పాటు రూ.31,200లు స్వాధీనం చేసుకున్నారు. అయితే గుర్రపు శివపై ఇప్పటికే అనేక కేసులు ఉన్నట్లు గుర్తించిన పోలీసులు అతను చెడు వ్యసనాలకు బానిసై వరుస దొంగతనాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. దీంతో అతని నుంచి మరిన్ని వివరాలు రాబడుతున్నారు. కేసు ఛేదించిన సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ జగదీష్‌ల బృందానికి క్రైం డీసీపీ ఏ.వెంకటరత్నం, ఏసీపీ ఎ.వెంకటరావు అభినందనలు తెలిపారు.

31న పాలిటెక్నిక్ స్పాట్ అడ్మిషన్లు

మురళీనగర్: రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మొదటి సంవత్సరం మిగిలిన సీట్ల భర్తీకి ఈ నెల 31న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు ఓ ప్రకటనలో తెలిపారు. పాలిసెట్-2024లో ఉత్తీర్ణత లేదా 10వ తరగతి ఉత్తీర్ణులైనవారు ఆ రోజు ఉదయం 10 గంటల వరకు దరఖాస్తులు సమర్పించవచ్చన్నారు. అదే రోజు ఉదయం 11 గంటలకు సీట్ల ఖాళీల ప్రకారం ప్రవేశాలు కల్పిస్తామన్నారు. పాలిసెట్-2024 ప్రవేశ పరీక్ష రాయకపోయినా స్పాట్ అడ్మిషన్‌ను దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. విద్యార్థులు పాలిసెట్ హాల్ టికెట్, ర్యాంక్ కార్డు, 10వ తరగతి మార్కుల జాబితా, బదిలీ సర్టిఫికెట్(టీసీ), 4 నుంచి 10 తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు, కుల ధ్రువీకరణ పత్రం, నాలుగు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఈడబ్ల్యూఎస్ అర్హత ఉన్నవారు సంబంధించి ధ్రువపత్రం, ఆధార్ కార్డు ఒరిజినల్స్‌తో పాటు మూడు సెట్‌లు జిరాక్స్ కాపీలను తీసుకువాలని సూచించారు. స్పాట్ అడ్మిషన్ల రోజున రిజిస్ట్రేషన్ ఫీజు, కళాశాల ఫీజుతో కలిపి సుమారు రూ.5,500 సీటు పొందిన వెంటనే చెల్లించాల్సి ఉంటుందన్నారు. కంచరపాలెం పాలిటెక్నిక్ కళాశాలలో సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, మెటలర్జికల్ ఇంజనీరింగ్ కోర్సుల్లో స్వల్ప ఖాళీలు ఉన్నట్లు ప్రిన్సిపాల్ వెల్లడించారు.

1 నుంచి దేవమాత మోక్షారోపణ మహోత్సవాలు

కంచరపాలెం : జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ కెథడ్రిల్ చర్చి ఆధ్వర్యంలో 160వ దేవమాత మోక్షారోపణ మహోత్సవాలు ఆగస్టు 1 నుంచి నిర్వహించనున్నామని పునీత రాయప్ప ప్రధాన దేవాలయం విచారణకర్త రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాశ్ తెలిపారు. శనివారం సెయింట్ పీటర్స్ చర్చి కమ్యూనిటీ హాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరోజు సాయంత్రం స్లీమ్‌గుర్తు మండపంలో పతాకావిష్కరణ అనంతరం తిరువీధుల్లో తేరు (పల్లకి) ఊరేగింపు ఉంటుందన్నారు. ఆగస్టు 14 వరకు తేరు పలు వీధుల్లో తిరుగుతుందని 15న ప్రధాన మహోత్సవం నిర్వహిస్తామన్నారు. పీపీసీ (పారిస్ పాస్టల్ కౌన్సిల్) ఆధ్వర్యంలో ఉత్సవాల పోస్టరును ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఫాదర్లు పి. వినయ్‌కుమార్, పి.ఆంథోనీ, పీపీసీ అధ్యక్షుడు శ్రీమునిసిరి రాజేష్, కార్యదర్శి పి. ఫ్రాన్సిస్, జాయింట్ సెక్రటరీ జి. ఆనందరావు, జాయింట్ కోశాధికారి నిర్మల రాజు, రత్నం, గురు మండలి సలహా సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కరాస పోలీస్ క్వార్టర్స్‌లో సీపీ పర్యటన

పోలీస్ కుటుంబాలతో మాటామంతీ



సీపీ శంఖబ్రత బాగ్చీకి కృతజ్ఞతలు తెలుపుతున్న పోలీస్ కుటుంబ సభ్యులు



వృద్ధురాలితో మాట్లాడుతున్న సీపీ

గోపాలపట్నం : కరాసా పోలీస్ క్వార్టర్స్‌లో నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి శనివారం పర్యటించారు. ఇక్కడి సమస్యలు పరిష్కారమైన తీరుపై ఆరా తీశారు. ఈ నెల 15న పర్యటించిన ఆయన స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. వాటిని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ మేరకు శనివారం ఆ ప్రగతిని పరిశీలించారు. ఇక్కడి పోలీసు అధికారులతో కలిసి అంతా తిరిగారు. పోలీస్ కుటుంబాలతో మాట్లాడారు. గృహ సముదాయాల చుట్టూ ఉన్న పిచ్చిమొక్కలు, పొదల్ని తొలగించిన తీరును గమనించారు. నూతనంగా ఏర్పాటు చేసిన వీధి దీపాలు, గృహ సముదాయాల మరమ్మతులు, డ్రైనేజీ పనులు, కొత్త బోరు పునరుద్ధరించి నీటి సదుపాయం కల్పించిన తీరు పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది, కుటుంబ సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. పోలీస్ కుటుంబాల సంక్షేమానికి ప్రాధాన్యమిచ్చే కమిషనర్ రావడం సంతోషంగా ఉందని కొనియాడారు. ఈ సందర్భంగా వారితో సీపీ మాట్లాడారు. ఇంకా ఏమైనా సమస్యలున్నాయా అని వారిని అడిగి తెలుసుకున్నారు. కుటుంబ పరంగా, ఉద్యోగ పరంగా ఇతర సమస్యలుంటే 7995095799 నంబర్‌కు తెలపాలని కోరారు. ఆయనతో పలువురు పోలీసు అధికారులు ఉన్నారు.

అబ్దుల్ కలాంకు ఘన నివాళి

విశాఖ విద్య: మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం వర్థంతిని 52వ వార్డు సంజీవయ్యనగర్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. కలాం విగ్రహానికి జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ కాలనీ వాసులతో కలసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ శ్రీధర్ మాట్లాడుతూ నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించి దేశానికి అబ్దుల్ కలాం ఎంతో సేవ చేశారని కొనియాడారు. యువతకు దిక్సూచిగా నిలిచిన కలాం ఆశయాల సాధనకు ప్రతీ ఒక్కరూ పాటుపడాలన్నారు. ఆయన చూపిన మార్గంలో నేటి తరం యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.



కలాం విగ్రహానికి పూలమాల వేస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్

సముద్ర చైతన్యంపై విద్యార్థులకు అవగాహన



కేవీ-1 విద్యార్థులతో నేవల్ అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు

కంచరపాలెం: భారత నావికాదళంలో 'సముద్ర చైతన్యం-జీవితంతో పరిచయం' అనే అంశాలపై కంచరపాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్ కేంద్రీయ విద్యాలయం-1 విద్యార్థులకు మూడు రోజులుగా నిర్వహించిన అవగాహన సదస్సు శనివారంతో ముగిసింది. కేంద్రీయ విద్యాలయం-1కు చెందిన విద్యార్థులు మెటీరియల్ ఆర్గనైజేషన్‌ను సందర్శించారు. సుమారు 100 మంది విద్యార్థులకు అగ్ని మాపక ప్రదర్శన, డిపో పనితీరు గురించి నేవీ అధికారులు అవగాహన కల్పించారు.మానవ రహిత రోబోట్‌లతో కూడిన కసరత్తులు, స్టోర్‌ల నిర్వహణ కోసం ఆటోమేటిక్ స్టోరేజ్, రిట్రీవల్ సిస్టమ్‌ను ఎలా ఉపయోగించాలో విద్యార్థులకు వివరించినట్టు విద్యాలయ ఉపాధ్యాయులు తెలియజేశారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న నేవల్ అధికారులు

పేదలకు ఉచితంగా న్యాయ సహాయం

సబ్బవరం: మండల కేంద్రం సబ్బవరంలో జాతీయ మానవ హక్కుల పరిరక్షణ సంస్థ(ఎన్‌హెచ్ఆర్‌సీ) ప్రాంతీయ కార్యాలయాన్ని శనివారం సంస్థ సీఈవో టీఎస్ రామచంద్రనాయుడు, సర్పంచ్ దొడ్డం ప్రసాదరావు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎన్‌హెచ్ఆర్‌సీ సీఈవో రామచంద్రునాయుడు మాట్లాడుతూ ప్రజల హక్కులను కాపాడేందుకు.. అన్యాయం,అక్రమాలపై పోరాటానికి సంస్థ కృషి చేస్తుందన్నారు. అవసరమైన వారికి ఉచిత న్యాయ సహాయం అందిస్తామని చెప్పారు.భూ వివాదాల పరిష్కారానికి,వినియోగదారుల హక్కుల పరిరక్షణకు.. కులరహిత సమాజ స్థాపనకు,సమాచార హక్కు చట్టం పక్కాగా అమలు చేసేందుకు,వృద్ధులు,బాలల,మహిళల హక్కుల కోసం పోరాటం సాగిస్తున్నామన్నారు. తమ సంస్థలో న్యాయవాదులు,రిటైర్డ్ జడ్జిలు అనేక మంది సభ్యులుగా ఉన్నారన్నారు.గ్రామీణ ప్రజలకు ఉచితంగా మెరుగైన న్యాయ సేవలు అందించాలన్న లక్ష్యంతో సబ్బవరం మండలంలో ప్రాంతీయ కార్యాలయం ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బలిరెడ్డి సూర్యప్రసాద్,వైస్ ఛైర్మన్ సూరిబాబు,డైరెక్టర్లు సుబ్బారావు, లక్ష్మీ గాయత్రి, జిల్లా కోర్టు న్యాయవాది సత్య,చిరంజీవిరావు తదితరులు పాల్గొన్నారు.



ఎన్‌హెచ్ఆర్‌సీ ప్రాంతీయ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న సీఈవో రామచంద్రనాయుడు